# వేడివేడి బొబ్బట్లు

రచన :
శ్రీమతి పఠానేని శ్రీశైల భ్రమరాంబ.

గోవర్ధనరావుకి వేడి వేడి బొబ్బట్లంటే మహా ఇష్టం. నిజంగా వాటిని తల్చుకుని తెగ ఊరిపోతూ వుంటాడు. పండుగలు పబ్బాలు ఏమీ రాకపోయినా చీటికీ మాటికీ టిఫిన్‌గా బొబ్బట్లు చెయ్యమంటూ వేదిస్తాడు. ఇంట్లో - సరిగ్గా ఆ రోజు తను స్కూల్లో పిల్లలకీ పాఠాలు చెప్తూ 'వింటే భారతం వినాలి; తింటే బొబ్బట్లే తినాలి' అంటూ చెప్పాడు. అప్పటినుంచీ ఇంటికి రాగానే తన భార్య రుక్మిణిచేత తొందరగా బొబ్బట్లు చేయించుకు తినాలని ఓ పావు గంట ముందుగానే ఇంటికి వచ్చాడు. వచ్చీ రాగానే 'రుక్కూ; ఇవాళ బొబ్బట్లు చేస్తావా?' అనడిగాడు.

'మీకేంపనిలేదేమో ఇంక ! అస్తమానూ బొబ్బట్ల యావ తప్పించి మారు గొడవ లేనట్లుంది.'

పాపం అతనికి ఎల్లాగైనా తినాలని చచ్చేటంతా వాంఛగా వుంది. ఆమె అసమ్మతి కనబర్చడంతో అతనికి ఒళ్ళు మండింది. 'అయితే ఇప్పుడు చెయ్యడానికి నీకు కుదరదా?' అన్నాడు కొంచెం దీనత్వంగా.

'నేను చెయ్యలేనండీ! మీరేమనుకున్నా సరే! అసలే పిల్లలతో పని తెమలక ఇప్పటివరకూ చాకిరీతో కొట్టుకు చచ్చి ఇప్పుడే ఇవతలి పడ్డాను. అప్పుడే మీరు కాఫీకు వచ్చారాయె - నన్ను చూచి కాస్త జాలిపడేవాళ్ళు కూడా లేరు.

'నాకు తినాలని వుందే...' ఎంతో ప్రేమగా అడిగాడు.

'ఉంటుంది - ఉండదూ? తేరగా ఎవరైనా చేసిపెడితే నాకూ తినాలని ఉంటుంది—వెధవ బొబ్బట్లు... బొబ్బట్లంటే ఊరికే అవుతాయా? తవ్వెడు శనగపప్పు, పంపు నూని, ఏబులం గోధుమ పిండి, పదలం పంచదార తగలేస్తే, రెండు గంటలు కొట్టుమిట్లాడి చాకిరీ చేస్తే ఏదో కాస్త అయిందనిపిస్తారు పిల్లలు మీరూ—కిరాణ కొట్లో క్రిందటి నెల బాకీ ఇంకా పాతిక రూపాయలివ్వాలి...మళ్ళీ ఈ నెల ఎంతవుతుందో తెలుసా?...'

'ఇవ్వాల్సిన బాకీలు నేనే తీర్చుకుంటాను కాని మీ పుట్టింటినుంచేమీ తెచ్చిపెట్టటం లేదులే...' అని ఉక్రోషంతో అన్నాడు.

'అమ్మా బొబ్మట్లు చెయ్యవే?' అంటూ గోముగా అడిగింది ఏడేళ్ళ రాధ రెండో కూతురు.

'అమ్మా! బాగుంటాయే? కొంచెం చెయ్యి-అందరం తిందాం!' అని మూడోది అయిదేళ్ళ వర్ధని కూడా శృతి కలిపింది.

పెద్దది రాజ్యంకు కూడా నోరూరి అడగాలనిపిస్తోంది కాని అమ్మ నోటికి భయ కిక్కురుమనకుండా చూస్తూ కూర్చుంది.

'అమ్మా! బొబ్బట్లు ఎంచక్కావుత్తాయి. చెయ్యి' అంటూ నోరూరించుకొంటూ తల్లి ఒళ్ళో కూర్చుని అడిగింది నాలుగో కూతురు మూడేళ్ళ లీల.

'అయితే ఇప్పుడు బొబ్బట్లు చేస్తావా?' చెయ్యవా? ఖచ్చితంగా అడిగాడు గోవర్ధనరావు.

అప్పటికప్పుడే కుంపటిమీద కాఫీకి డికాక్షను తీసింది. ఇంకా ఒంటి గంట కాలేదు. తను స్కూలుకి వెళ్ళడానికి యింకా గంట టైమ్ ఉంది. అదీకాక ఫస్టు పీరియడ్ అంతా తనకి ఖాళీయే-ఇంకో అరగంట ఆలస్యమైనా ఇబ్బంది లేదు. ఎల్లాగైనా బొబ్బట్లు చేయించుకు తినాలని అతని మనస్సు తహతహలాడ్తోంది.

'ఇప్పుడుమాత్రం నేను చెయ్యలేనండీ - కావాలంటే ఈ శ్రావణ మాసంలో ఎల్లుండి పున్నంముందు శుక్రవారం ఎల్లాగా వరలక్ష్మి పూజ చేసుకొంటాను. కాబట్టి ఆ రోజు చేస్తాను. సరేనా?' అంది కొంచెం రాజీకి వచ్చినట్లుగా.

'ఇంకా నయం. మళ్ళీ నెలలో మా అమ్మ తద్దినం నాడు చేస్తానన్నావు కాదు' అన్నాడు.

'ఏమిటండీ మూడు మూణ్ణాళ్ళకీ బొబ్బట్లంటూ వేధిస్తారు? చిన్నపిల్లలకంటే కూడా ఎక్కువైపోయారు. అయినా మీ కింత జిహ్వా చపలత్వం కూడదు సుమండీ! మీకు వచ్చేదేమో వందరూపాలాయె! అన్నీ అందులోనే

సర్దుకోలేక అయిదుగురు ఆడపిల్లల్తో చాలీ చాలక ఛస్తోంటే.....మీకు చూలింతరాలికంటే మనుసులు ఎక్కువై పోతోంటే ఇంకెల్లాగండీ? వర్షాకాలంలో కప్పుకోడానికి దుప్పట్లు లేక చలికి ఒణికిపోతోన్నా పిల్లలకి నాల్గు రూపాయలిచ్చి ఓదుప్పటీ కొనలేక పోతున్నాం రెండు నెలలనుంచి - పైగా రోజురోజుకీ ఇల్లా టిఫిన్లు చేస్తూంటే...మీ మటుక్కి మీరే కాకుండా ఇంట్లో కూడా దూబరా చేసేస్తే...'

'చాలు చాలించు ఇంక నీ లెక్చరు-నాకు బొబ్బట్లూ చెయ్యక్కర్లేదు నీ మొహం చెయ్యక్కర్లేదు - నీ పాటి ఇంగిత జ్ఞానం నాకూ వుందిలే - ఏదో కాసిని బొబ్బట్లు చెయ్యమంటే పొదుపు పొదుపు అంటూ గుంటుకు పోతున్నావ్? ఒక్కపూట నాల్గు బొబ్బట్లు చేసుకుంటేనే కాపరం కూలిపోతుందన్నట్లుగా అఘోరిస్తూ పొదుపుని గురించి ఇన్సూరెన్సు ఏజెంటులా ప్రారంభించావు.....' అంటూ కోపంగా అక్కడ పెట్టిన కాఫీ గ్లాసు వదలి లేచి వెళ్ళిపోయి పడక కుర్చీలో కూర్చున్నాడు అతడు.

'నే నిప్పుడు చెయ్యలేనండి. ప్రొద్దుటనుంచి చంటిది ఒక్కసారైనా చంక దిక్కి వేధించుకు తింటోంది. నా కిప్పుడు బొబ్బట్లు చేసే ఓపిక లేదు.'

'నే నడిగేసరికే నీ కెక్కడలేని నీరసం వస్తుందిలే. ఏదైనా అమ్మవారి నైవేద్యాలు వచ్చినప్పుడు మాత్రం కావల్సినంత ఓపిక ప్రవేశిస్తుంది' అంటూ ముఖం కందగడ్డలా చేసుకు అన్నాడు.

'అమ్మా! బొబ్బట్లు చెయ్యవే' అంటూ గారంగా అడిగింది వర్ధని.

'నీకూ మీ నాన్నకీ బొబ్బట్లు మనుసయ్యాయేం? వెధవ కానా! అర్ధరాత్రి అపరాత్రి లేచి బయటకి తీసుకెళ్ళమంటూ, తిన్నది అరక్క వేపుకు తింటున్నావు - రా పెడ్తాను బొబ్బట్లు' అంటూ వీపుమీద ఛెళ్ళున రెండు చరిచింది రుక్మిణి. ఆ దెబ్బలతో హోరుమంటూ ఏడ్పుకి లంకించుకొంది వర్ధని. ఆ ఏడ్పులో శివాలెత్తినట్లుగా గంతులేస్తూంటే అక్కడే వున్న వేడివేడి కాఫీ గ్లాసు ఒక్కతోపుతో చంటిదానిమీదకి తన్నింది. వేడి కాఫీకి కాలు కాలి చంటిపిల్ల గుక్కపట్టి ఏడ్పుకి లంకించుకొంది.

'ఛీ! ఛీ!! దరిద్రపు కొంప!!! రెండు బొబ్బట్లు చెయ్యమంటే ఇంత రాద్ధాంత సిద్ధాంతమా? ఇంక ఈ జన్మలో మళ్ళీ నిన్ను నేను బొబ్బట్లు చెయ్యమంటే మాదిగాడు ఛండాలుడే!' అంటూ అరిచి విసవిసలాడ్తూ వెళ్ళిపోయాడు గోవర్ధనరావు.

ఇంట్లో పిల్లలని ఊరుకోబెట్టి తలలు దువ్వి వాళ్ళని సముదాయించలేక సతమతమై పోతోంది రుక్మిణి.

గోవర్ధనరావు స్కూలుకి వెళ్ళాడన్నమాటే కాని ఆతని మనస్సు బొబ్బట్లుని తల్చుకొని అతలా కుతలం అయిపోతోంది. వెయిటింగు రూమ్‌లో ఖాళీగా కూర్చున్నాడు తాపీగా ఆలోచించుకొంటూ - తనకి వేడివేడి బొబ్బట్లంటే ఎంత ఇష్టమో రుక్మిణికి పూర్తిగా తెల్సు. అటువంటప్పుడు అవి చెయ్యకపోతే నే నెంత బాధ పడ్తానో తెలుసుండీకూడా...ఆడదానికి అంత పట్టుదల అయితే?...ఏమో! చేస్తుందేమో! అబ్బే-అది చెయ్యనంటే చెయ్యదు-ఆడదాని కంతపంతమైతే ఆ సంసారం చట్టబండలైనట్లుగానే వుంటుంది-పైగా నామీద కోపమంతా పిల్లలమీద చూపించి కొట్టడమా? బొబ్బట్లు ఇవిగో నంటూ వాళ్ళ వీపుమీద మ్రోగిస్తుందా?......ఆ పళంగా మళ్ళీ ఆమె వీపుమీద నేనే వడ్డిస్తే ఆబొబ్బట్లు!- ఇవ్వాళ సాయంత్రం ఇంటికి వెళ్ళగానే ఆ సంగతేదో కనుక్కుంటూ - ఇవ్వాళ అంతు తేల్చి వదుల్తా - అనుకొంటూ క్షణికావేశంతో అట్టుడికి పోతున్నాడు గోవర్ధనరావు.

స్కూల్లో పిల్లలకి పాఠాలు చెప్తూంటే! 'మాష్టారూ! ప్రొద్దుట చెప్పిన పాఠం మళ్ళీ చెప్పండి' అనడిగారు. సరిగ్గా మళ్ళీ చెప్తూండగానే పూర్వకవులను గురించి చెప్పుకొస్తూ వాటి ప్రాముఖ్యతని వర్ణిస్తూ 'తింటే బొబ్బట్లే తినాలి; వింటే భారతమే వినాలి' అన్నాడు మామూలు ధోరణిలో. అంతలోనే మళ్ళీ మర్చిపోయిన బొబ్బట్లు గుర్తుకు వచ్చి, మానేసిన మధ్యాహ్నం కాఫీ జ్ఞప్తికి వచ్చి కడుపులో దేవురించుకుపోయింది ఆకలి బాధ.

'అయితే మాష్టారూ? బొబ్బట్లు అంత రుచిగా ఉంటాయిటండీ?'' అన్నాడు ఆకతాయి ఎస్సెల్సీ స్టూడెంటు.

'ఆ! వెధవ బొబ్బట్లని గురించి అంత గొప్పేముంది?' అన్నాడు మరో బండాభాయి స్టూడెంటు.

బొబ్బట్లని గురించి నిస్సారం చూపించేసరికి తన మనస్సు గట్టుమీద పడిన చేపలా గిజ గిజా కొట్టుకొంది. ఇంక కోపానికి తట్టుకోలేక వేడి వేడి బొబ్బట్లలో వుండే ఆధిక్యతని ప్రత్యేకంగా వాళ్ళకి చెప్పాలని లెక్చరు ప్రారంభించాడు.

'ఇదుగో ఆదికాలం నుంచీ పిండి వంటలన్నింటిలోనూ బొబ్బట్లు మహారాజు పదవి పొందాయి. శ్రీనాథ కవికి బొబ్బట్లంటే మహా ఇష్టమని ఓ పద్యం వర్ణించి వ్రాసుకొన్నాడు. ఏ పండుగ వచ్చినా, ఏ శుభకార్యమైనా గౌరవనీయమైన పిండివంట ఏది? అంటే ముందుగా బొబ్బట్లు అనే చెప్పాలి. ఇంక వాట్ల రుచిని వర్ణించడానికి...మానవులకే అసాధ్యం. గోధుమ పిండి తోపు చక్కగా పల్చగా అరటి ఆకుని అద్ది, అందులో శనగ పూర్ణం, ఘుమ ఘుమ యాలక్కాయల పొడి వాసన గుప్పున కొడ్తూంటే చక్కగా అద్ది పెనం మీద వేసి నెయ్యిగాని, నూనెగాని బాగా వేసి కొంచెం దోరరంగులో, గోధుమ వర్ణంతో వుండే ఆ బొబ్బట్లు... వేడి వేడి బొబ్బట్లలో ములగాక కమ్మని నెయ్యి పోసుకు తింటూంటే...(పాపం! అల్లా చెప్తూంటేనే తనకి నోట్లో నీళ్లూరి పోతున్నాయి)—బొబ్బట్లు తిని ఎంత కాలమైనా అన్నం లేకుండా వుండిపోవచ్చు. వాట్ల రుచి అతి మధురం. నోట్లో వేసుకొంటే కరిగిపోతాయి. అసలు ఆరోగ్యానికి, ఆనందానికి కూడా వారానికోసారైనా బొబ్బట్లు తినడం శ్రేష్ఠం...''

'అయితే మాష్టారూ! రేషనింగు రోజుల్లో మీరు బొబ్బట్లు తినే వుండేవారన్నమాట!' ఓ కొంటె కోణంగి స్టూడెంటు ప్రశ్న.

'ఆ పిండికి కొంచెం దళసరిగా వచ్చేవి. అంతే' అప్రయత్నంగా అన్నాడు.

'అయితే మీ యింట్లో గోధుమ పిండి, పంచదార, శనగపప్పు వగైరాలకి ఖర్చు ఎక్కువే అవుతుందేమో కదండీ?' ఓ అమ్మాయి సూటీగా అడిగింది.

'ఖర్చుకి ఏదైనా ఒకటే. బొబ్బట్లు తిన్నాక ఇంక అన్నం ఎల్లాగూ తినలేరు. ఇంక ఏదైతే మాత్రం పోయిందేమిటి?' అతని కడుపులో వుండే గాభరా అంతా ఆ ఎస్సెల్సీ స్టూడెంట్సు ముందు క్రక్కేశాడు.

'నాకు బొబ్బట్లంటే పిసరంతైనా ఇష్టంలేదు మాష్టారూ! వాట్ల పేరు వింటే కూడా నాకు కిట్టదు. నేను కారం ఎక్కువ తింటా' అన్నాడు ఓ పొట్టి కుర్రాడు.

'షటప్-బొబ్బట్లంటే ఇష్టంలేనివాడీసృష్టిలో వుంటాడంటే నేను నమ్మను. నీకు ఇంట్లో ఎప్పుడూ చేసి పెట్టక పోవడంచేత బహుశా అవి బాగుండవేమోనని నువ్వు దురభిప్రాయపడ్తున్నావేమో!' అన్నాడు తనకి అత్యంతప్రియమైన బొబ్బట్లని తల్చుకు గుటకలు మింగే గోవర్ధనరావు.

'వేడి వేడి బొబ్బట్లు' క్లాసులో తలవొంచుకుని ఏ కుర్రాడో అన్నాడు ఆ మాట. ఆ అన్నవాడి నోటినిండా పటికి బెల్లం పెట్టాలన్నంత ప్రీతికల్గినా ఎవరన్నారో మాత్రం గుర్తించలేకపోయాడు గోవర్ధనరావు.

అంతలో ఆ పీరియడ్ పూర్తయిపోయి బెల్ కొట్టారు. గోవర్ధనరావు క్లాసునుంచి బయటకు వస్తూంటే 'వేడివేడి బొబ్బట్లు' అనే కేకలు అందరి నోటంటా ఆ రూమంతా ప్రతిధ్వనించేలా విన్పించినా గబగబా నడిచి ఇంకో క్లాసుకివెళ్ళిపోయాడు ఆతడు.

ఆ క్లాసులో కూడా భారతం లోనికథను ఏదో చెప్తూ 'తింటే బొబ్బట్లే తినాలి వింటే భారతమే వినాలి. అని చెప్తూ ఆ పాఠం పూర్తిచేసాడు తెలుగుటీచరు గోవర్ధనరావు.

స్కూలు వదలిపెట్టగానే ఇంటికి వచ్చే గోవర్ధనరావుకి వెనక్కాల వానర సైన్యంలా కొంటె పిల్లలు "వేడివేడి బొబ్బట్లు అంటూ ఉడికించి అరుపులు ప్రారంభించారు. ఆతడుకూడా తనలో ఉడికి పోతున్నాడు. ఇంతమంది నోట్లో తన బొబ్బట్లని గురించి ఇంక ఏమైనా సరే; ఇంటికి వెళ్ళి బొబ్బట్లు చేయించుకుతినాలి. తనని బొబ్బట్ల తిండిపోతు అన్నా సరే; ఎందరు ఎంత హేళన చేసినా సరే; కడకు విధంచెడ్డా ఫలం దక్కాలి కదా! ఎల్లాగైనా బొబ్బట్లు చేయించుకు తినాలి. అసలు బొబ్బట్లు ఎందుకు చెయ్యదో కనుక్కుంటా! మగవాడన్నవాడికి ఆమాత్రం హక్కులేదూ ? ...బొబ్బట్లు చెయ్యకబోతే ఈ రాత్రికి నిరశసవ్రతం చేస్తాను. అనుకొంటూ పెద్దపెద్ద అంగలతో ఇంటికిచేరి భడాలున తలుపు గెంటాడు గోవర్ధనరావు.

"నా న్నొచ్చాడోయ్! నా న్నొచ్చాడు!!" అంటూ పిల్లలంతా ఒక్కసారిగా అనేసరికి లేనినవ్వు ఎరువు తెచ్చుకొని అమ్మేదీ?" అన్నాడు.

"నాన్న ఒచ్చేవరకూ మాట్లాడకుండా కూర్చున్న వాళ్ళకి చాలా బొబ్బట్లు పెడ్తానంది అమ్మ. వంటింట్లో పెనంమీద వేస్తోంది" అంది పెద్దకూతురు రాజ్యం.

పిలిస్తేనే కాని వెళ్ళకూడదని పడక కుర్చీలో కూర్చున్నాడు. ఇంకా పిలవదేమో అని క్షణక్షణానికి మనస్సులో ఆరాటం ఎక్కువై పోతోంది ఆతనికి.

"రాజ్యం! నేను వచ్చానని అమ్మకి చెప్పావా?" అని మెల్లిగా అడిగాడు మళ్ళీ ఎక్కడ తనమాట భార్యకి వినిపిస్తుందో అని.

పిల్లలందరూ వెళ్ళి ఒకరు తర్వాత ఒకరు చొప్పున తల్లికి వార్త అందించారు నాన్న వచ్చాడు అని.

అయినా ఇంకా పట్టుకురాదేం చెప్మా...అంతా చల్లారిపోయాక తెస్తుందేమో! పోనీ అక్కడికి వెళ్ళి స్వయంగా చూస్తే!...అప్పుడే తనువచ్చి పదిహేను నిమిషాలైంది. ఇంక తట్టుకోలేక పోయాడు. భార్యని రప్పించేందుకు ఒక్కటే సాధన కుర్చీపట్టుకు నిల్చున్న చంటిదాన్ని, "వెధవకానా!" ఆ బురద చేతుల్తో కుర్చీ అంతా తగలేస్తున్నావా?" అంటూ వీపుమీద విమానం మోత మోగించాడు.

"చాల్లెండి. ఊరుకోండి. అనవసరంగా దాన్నెందుకు కొడ్తారు? యివిగో పూర్తయ్యాయి. అంటూ పళ్లెంతో సహా తన శ్రీమతి ప్రత్యక్షమయ్యే సరికి ఓప్లేటుతో వేడివేడి బొబ్బట్లు తనచేతికి అందివ్వడమే తడువుగా ఉపక్రమించేడు, ఛెడ వేడిగా వున్నాయి. బొబ్బట్లు తడిసేలా కమ్మని నెయ్యి పోయించుకొన్నాడు. అల్లాగే ఆపసోపాలు పడ్తూ గబగబా ఊదుకొని బొబ్బట్లు దొంతర్లు ఖాళీచేస్తున్నాడు. పిల్లలందరికీ తలాల ఒక్కొక్కటి చేతికిచ్చి "ఇంకా వెయ్యనా?" అంటూ పళ్ళెంతో నిల్చుంది రుక్మిణి.

అంతలో ఎవరో కుర్రాడు వీధి తల్పు గెంటి ఎదురుగా వరాండాలో తెలుగు మాష్టారు పిల్లలు బొబ్బట్లు తింటూ ఉన్న దృశ్యం చూచి వెళ్ళి వీధిలో పదిమంది పిల్లలూ చేరి "వేడివేడి బొబ్బట్లు" అని అరుస్తోంటే మనస్సులో పెట్రోలు మంటలా కోపం మండుతోన్నా బొబ్బట్లు కమ్మగా గొంతుకలోనుంచి జారిపోతున్నాయి.

పాపం! ఆనాటినుంచీ ఎన్నిచోట్లికి ట్రాన్స్ఫరైనా గోవర్ధనరావుకి వేడివేడి బొబ్బట్లు మాష్టారు అనేపేరే సార్థకనామధేయమై పోయింది.

పండిత డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
Diamond Jubilee
1898 1958
ఆయుర్వేదాశ్రమం(ప్రైవేట్)లిమిటెడ్,
మదరాసు-17.